


# అమ్మాయి నచ్చింది

అమ్మాయి నడిచి వచ్చి కూర్చుంది. పొడవైన జడ, పొడవైన ముక్కు, ఎర్రటి పెదవులు. సినిమా హీరోయిన్‌లా అందంగా వుంది.

"ఏం చదివింది?" ప్రశ్నించారు ఒకరు.

"ఎస్ ఎస్ సి."

"ఎన్నేళ్ళు?"

"పదారు."

"సంగీతం వచ్చా?"

"పాటలొచ్చు."

"ఏం పేరు?"

"విజయ."

'విజయ విజయ విజయ విజయ' నాల్గుసార్లు అనుకొన్నాడు యువకుడు. ఎంత అందంగా వుంది? —




మీకు అర్థమై దనుకుంటాను. అమ్మాయిని చూడటాని కొచ్చారని—

అమ్మాయి అబ్బాయిని చూచింది. ఎర్రగా..... రింగుల వెంట్రుకలు..... అచ్చం సినిమా హీరోలా...

అమ్మాయికి అబ్బాయి నచ్చాడు అబ్బాయికి అమ్మాయి నచ్చింది. అబ్బాయి వాళ్లు బయట కెళ్ళారు. తల్లి అడిగింది. "ఏమిరా నచ్చిందా?"

"నచ్చింది."

లోపలి కొచ్చారు. "మాకునచ్చింది." అన్నారు.

'కట్నం' అడిగాడు ఒకాయన మధ్యస్తుడు.

అబ్బాయి తండ్రి అన్నాడు. "కట్నం మీ యిష్టం. మావాడు యిప్పటికే యాభై మంది అమ్మాయిలను చూసాడు, ఎవరూ నచ్చలేదు. అందరికీ వీడు నచ్చాడు. వీడు అందరినీ తిరస్కరిస్తూ వచ్చాడు. ఈమె నచ్చిందన్నాడు. మాకు సంతోషంగా వుంది. అదే చాలు. మీరు ఎంత ఇచ్చినా పర్వాలేదు."

ఈ మాటలు విన్న పెద్దలు సంతోషించారు.

ఈ మాటలు విన్న అమ్మాయి కొంతసేపు ఆలోచించింది. "యాభై మందిని తిరస్కరించాడా?" అనుకుంది.

గబుక్కున లేచి నిల్చుంది.

"నాకు అబ్బాయి నచ్చలేదు." లోపలికెళ్ళిపోయింది.

—:o:—